సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 23 । అక్టోబర్ । 2024



విజృంభిస్తున్న విషజ్వరాలు

వై.రామవరం మండలంలో విషజ్వరాలు విజృంభించాయి. స్థానిక ఏరియా ఆస్పత్రి జ్వరపీడితులతో కిటకిటలాడుతోంది. 8లో



భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు

విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం హెచ్చరించారు. 8లో

బబ్బేలమ్మకు జలాభిషేకం



విశాఖ: నగరంలోని పీఎంపాలెంలో బబ్బేలమ్మ అమ్మవారికి మంగళవారం మహిళలు 108 కలశాలతో జలాభిషేకం చేశారు.

న్యూస్‌రీల్

26న జాబ్‌మేళా

రంపచోడవరం: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 26న రంపచోడవరంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డా. పి. రోహిణి తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఈ జాబ్‌మేళాకు డైకిన్, కేర్ ఫర్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని ఆమె తెలిపారు. జిల్లాలో 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన పదో తరగతి, ఇంటర్, డిప్లమో, డిగ్రీ ,పీజీ పూర్తి చేసిన నిరుద్యోగ యువత ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాత్రి సర్వీసులు పునరుద్ధరణ

సీలేరు: విశాఖపట్నం- భద్రాచలం మార్గంలో మంగళవారం నుంచి రాత్రి బస్సు సర్వీసులను ఆర్టీసీ అధికారులు పునరుద్ధరించారు. అల్పపీడన ప్రభావంతో గత నెల 8వ తేదీన కురిసిన భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడిన నేపథ్యంలో అధికారులు రాత్రి బస్సు సర్వీసులను నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. సమస్యను గుర్తించిన అధికారులు రాత్రి సర్వీసులను పునరుద్ధరించారు.

జల్‌జీవన్ మిషన్ పనులు వేగవంతం

- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : జల్‌జీవ్ మిషన్ పథకంలో చేపడుతున్న తాగునీటి పథకం పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి జిల్లాలోని 22 మండలాల ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీటి పథకాల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్నందున నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. మంచినీటి పథకాల ట్యాంక్‌లను ప్రతి 15రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని ఆదేశించారు. ట్యాంకుల నిర్వహణపై రిజిస్టర్లు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ఈఈ జవహర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షానికి పొంగిన వాగు

- ట్రాఫిక్‌కు అంతరాయం



నిర్మాణదశలో ఉన్న బ్రిడ్జి వద్ద పొంగి ప్రవహిస్తున్న వాగు

గంగవరం : మండలంలోని బుధవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి కొండవాగులు పొంగి ప్రవహించాయి. కుసుమరాయి జంక్షన్‌కు సమీపంలో వాగు పొంగి ప్రవహించడంతో రంపచోడవరం - గంగవరం మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనాలను దారి మళ్లించారు. వాగులో ఎవ్వరు దిగకుండా ఎస్ఐ భూషణం సిబ్బందిని ఏర్పాటుచేశారు. వాగు తగ్గుముఖం పట్టిన తరువాత వాహన రాకపోకలు మొదలయ్యాయి.

ఆక్రమణదారులకు నోటీసులు

- 15రోజుల్లోగా తొలగించాలని ఆదేశం



ఆక్రమణదారులకు నోటీసులు అందజేస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

పాడేరు : మండలంలోని చింతలవీధి పంచాయతీ పరిధిలోని 516-ఈ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 54, 56లో ప్రభుత్వ స్థలాలను పలువురు ఆక్రమించారు. సుమారు 26 దుకాణాలను నిర్మించారు. దీనిపై ఇటీవల కొంతమంది కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ ఆక్రమణకు గురైన ప్రాంతాలను పరిశీలించారు. దీనిపై తహసీల్దార్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. ఈ మేరకు ఆక్రమణ దారులకు నోటీసులు జారీ చేశారు. 15 రోజుల్లోగా ఆయా దుకాణాలను ఖాళీ చేయాలని లేకుంటే తామే జేసీబీలతో తొలగిస్తామని నోటీసుల్లో స్పష్టం చేశారు.



చాపరాయి జలవిహారిని కమ్మేసిన మంచు తెరలు



జోలాపుట్టు జలాశయం వద్ద కనువిందు చేస్తున్న ప్రకృతి అందాలు



పైన్ వనాల్లో పర్యాటకుల కోసం అటవీశాఖ ఏర్పాటు చేసిన టెంట్లు

మంచు కురిసే వేళలో మన్యం అందాలు, ప్రకృతి సోయగాలు పర్యాటక ప్రేమికులను ఇట్టే ఆకట్టుకుంటాయి. శీతాకాలంలో పూసే వలిసె పూలు పర్యాటకుల మనసును దోచుకుంటాయి. జలపాతాలు జలజలపారుతుంటే ఆ మజాయే వేరు. అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు విశాఖ మన్యం పురివిప్పిన నెమలిలా అందాలతో కనువిందు చేస్తుంది. అందుకే దేశవిదేశాల నుంచి పర్యాటక ప్రేమికులు వాలిపోతారు. ప్రకృతి ఒడిలో సేదతీరుతారు..భూతల స్వర్గంలో విహరిస్తారు.

పురి విప్పిన నెమలిలా..

మన్యం రమణీయం

- నెల రోజులు ముందుగానే ప్రారంభమైన పర్యాటక సీజన్
- ఆకట్టుకుంటున్న ప్రకృతి అందాలు



తారాబు జలపాతం అందాలను తిలకిస్తున్న సందర్శకులు


చింతపల్లి/ముంచంగిపుట్టు/అరకులోయ టౌన్/జి.మాడుగుల/డుంబ్రిగుడ: ఈ ఏడాది పర్యాటక సీజన్ నెలరోజులు ముందుగానే ప్రారంభమైంది. అధికవర్షాల కారణంగా మంచు దట్టంగా కురుస్తోంది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. మన్యం అందాలను తిలకించేందుకు పర్యాటకుల రాక మొదలైంది. గత ప్రభుత్వంలో పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యమిచ్చింది. పర్యాటకులకు అనువుగా సందర్శనీయ ప్రాంతాలను అభివృద్ధి చేసింది. వసతులు కల్పించింది.

- పాడేరు మండలంలో విశ్వఖ్యాతి పొందిన వంజంగి హిల్స్ పరిసరాల్లో ప్రైవేట్ కాటేజీలు పెరిగాయి. మట్టిరోడ్డు ఏర్పాటైంది. రూ.1.50 కోట్లతో మూడు కిలోమీటర్ల పొడవునా తారు రోడ్డు నిర్మాణ పనులు జరగాల్సి ఉంది.
- లంబసింగి-చింతపల్లి రోడ్డులో కృష్ణాపురంలో పైన్ (కరెన్సీ) చెట్లు ప్రాంతాన్ని పర్యాటకంగా అటవీశాఖ అభివృద్ధి చేసింది. పర్యాటకులు బస చేసేందుకు అనువుగా సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చింది.
- లంబసింగి ఘాట్ రోడ్డులో బోడకొండమ్మ వ్యూపాయింట్‌ను రూ.45లక్షలతో గత అరకు ఎంపీ మాధవి హయాంలో అభివృద్ధి చేశారు. పర్యాటకులు క్యాంపెయిన్ టెంట్లు వేసుకుని బస చేసేందుకు అనువుగా తీర్చిదిద్దారు.
- కొత్తపల్లి జలపాతం పరిసరాలను రూ.1.2 కోట్లతో పాడేరు ఐటీడీఏ అభివృద్ధి చేస్తోంది. ఇవన్నీ కొద్దిరోజుల్లో పూర్తికానున్నాయి. ఇక్కడ కూడా పర్యాటకులు టెంట్లు వేసుకుని రాత్రి వేళ బస చేసేందుకు అనువుగా ఉంటుంది.
- ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన చాపరాయి జలపాతాన్ని పాడేరు ఐటీడీఏ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసింది. ఇక్కడ పర్యాటకులకు అనువుగా సౌకర్యాలు కల్పించింది. గార్డెనింగ్, ముఖద్వారం, లైటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.
- అరకులో గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానవనాన్ని పాడేరు ఐటీడీఏ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసింది. పర్యాటక కేంద్రం కావడంతో ఇక్కడికి సమీపంలో ప్రైవేట్, పర్యాటకశాఖ కాటేజీలు ఉన్నాయి.
- మాడగడ సన్‌రైజ్, గంగగుడ్డి స్నోఫాల్ వ్యూపాయింట్‌ల వద్ద ప్రకృతి అందాలు కట్టిపడేస్తుంటాయి. ఇక్కడ కూడా పర్యాటకులు క్యాంపెయిన్ టెంట్లు ఏర్పాటుచేసుకుని బస చేసేందుకు అనువుగా ఉంటుంది. ఈ ప్రాంతంలో అందాలు తిలకించాలంటే తెల్లవారుజాము 4 గంటలకు అక్కడికి చేరుకోవాలి. దేశ, విదేశాల నుంచి పర్యాటకులు ఇక్కడికి తరలి వస్తున్నారు. ఇక్కడి మంచు అందాలు పాల సముద్రాన్ని తలపిస్తుంటాయి. గిరిజన సంప్రదాయ డప్పు వాయిద్యాలు, థింసా నృత్యాలతో సందడిగా ఉంటుంది.
- ముంచంగిపుట్టు మండలంలో చూడవలసిన ప్రదేశాలు చాలా ఉన్నాయి. మత్స్యగెడ్డ పరిసరాలు, డుడుమ జలపాతం, బురదగుంట, జడిగుడ వాటర్ ఫాల్స్ అందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలు ఉమ్మడిగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం కూడా చూడదగిన ప్రాజెక్ట్. ఈ ప్రాంతానికి ఎక్కువగా ఇరు రాష్ట్రాల నుంచి విద్యార్థులు విజ్ఞానయాత్రకు వస్తుంటారు.
- జోలాపుట్టు, డుడుమ ప్రాజెక్ట్ పరిసరాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రాంతంలో కొండలను తాకుతూ మేఘాలు, పొగమంచు అందాలు కనువిందు చేస్తున్నాయి. జోలాపుట్టు ప్రాజెక్ట్‌పై ఆధారపడి నాలుగు జలవిద్యుత్ కేంద్రాలు పనిచేస్తున్నాయి.
- పర్యాటక సీజన్‌లో చాపరాయి జలపాతంతో పాటు జాతీయ రహదారి పొడవునా అరకు, జైపూర్ జంక్షన్, రైల్వే గేటు, కురిడి, పంతల చింత, అంత్రిగుడ వరకు మంచుతో కప్పబడి ఉంటుంది. జనవరి వరకు ఈ ప్రాంతాలు పర్యాటకులతో సందడిగా ఉంటాయి.



మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్ వద్ద మంచు అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

మనసుదోచే వలిసె అందాలు



అరకు ప్రాంతంలో వలిసె సాగు

వలిసెల పూల అందాలు మన్యం సందర్శనకు వచ్చే పర్యాటకులకు స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇవి గిరిజన రైతులకు ఆదాయంతోపాటు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. భూమికి పచ్చని రంగేసినట్టుగా ఇవి అరకు నుంచి దారి పొడవునా ఆకట్టుకుంటున్నాయి. వలిసె సాగు చేపట్టిన కొంతమంది రైతులు వ్యవసాయపరంగా సాగు చేస్తున్నారు. ఈ తోటల్లో ఫొటోలు తీసుకునే పర్యాటకుల నుంచి రూ.20 తీసుకుంటూ ఆదాయం పొందుతున్నారు. దాలియా, పొద్దుతిరుగుడు పూల అందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

పొగమంచుతో ఇబ్బందులు



బోసుబెడ-మాడగడ మార్గంలో ఉదయం 9 గంటల వరకు కురుస్తున్న మంచు

అరకులోయ టౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో మంగళవారం పొగమంచు దట్టంగా కురిసింది. వాహనచోదకులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొద్దిరోజులుగా ఇదే పరిస్థితి ఉంటోంది. రాత్రి 12 గంటల నుంచి మంచు వానలా కురుస్తోంది. చలిగాలులు వీస్తున్నాయి. ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు వీడటం లేదు. దీంతో వాహన చోదకులు హెడ్ లైట్ల వెలుగులో రాకపోకలు సాగిస్తున్నారు.

అరకు పీనరీ అద్భుతం

- డీఎఫ్‌వో వెంకట సందీప్‌రెడ్డి



అరకు పీనరీని సందర్శించిన డీఎఫ్‌వో వెంకట సందీప్‌రెడ్డి



అరకు పీనరీలో మొక్కను నాటుతున్న డీఎఫ్‌వో వెంకట సందీప్‌రెడ్డి

డుంబ్రిగుడ: అరకు పీనరి అందాలు అద్భుతమని పాడేరు డీఎఫ్‌వో వెంకట సందీప్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని అంజోడ సిల్క్‌ఫారంలోని అరకు పీనరీని సందర్శించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైన్‌వృక్షాల అందాలు పీనరీకి తలమానికమన్నారు. ఇక్కడ సినిమా షూటింగ్‌లకు ఎంతో అనుకూలమన్నారు. ఎకో టూరిజంలో భాగంగా ఈ ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. పర్యాటకులకు ఆహ్లాదం అందించేలా మరింత అభివృద్ధి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డీఎఫ్‌వో ఉమామహేశ్వరి, రేంజ్ అధికారి శ్రీనివాసరావు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగులకు శుభవార్త

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయిమెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్, సద్గురు గ్రూప్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్లో 150 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. రిలేషన్‌షిప్ ఆఫీసర్, బిజినెస్ ప్రమోటర్స్, మార్కెటింగ్ మేనేజర్, టీమ్ లీడర్స్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై 18-35 ఏళ్ల వయసు గల అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చు. ఆయా ఉద్యోగాలను బట్టి జీతం నెలకు రూ.16 వేలు నుంచి రూ.25వేల వరకు ఉంటుంది.

అక్షరాస్యత శాతం పెంచేందుకు కృషి

కలెక్టర్ దినేష్‌కుమార్



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



జన సురక్ష కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : జిల్లా వ్యాప్తంగా వయోజన విద్య కార్యక్రమాలు నిర్వహించి అక్షరాస్యత శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న ఉల్లాస్ కార్యక్రమంపై ఆయన కార్యాలయంలో ఐసీడీఎస్, వయోజన విద్యా, పంచాయతీరాజ్, డీఆర్‌డీఏ, విద్యాశాఖ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న నైట్ వాచ్‌మేన్లు, వంట మనుషులు, హెల్పర్లకు క్రియాత్మక, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత నేర్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ భవనాలలో ప్రతి రోజు రెండు గంటలపాటు తరగతులు నిర్వహించి వయోజనులకు అక్షరాలు నేర్పించడం, చదివించడం, రాయడం చేపట్టాలని సూచించారు. ఎంపీడీవోలు, వెలుగు ఏపీఎంలు అక్షరాస్యత కార్యక్రమాల అమలుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య ఉప సంచాలకులు ఎస్.సుబ్రమణ్యవర్మ, సహాయ సంచాలకులు డి.చిన్నికృష్ణ, డీపీవో బి.లవరాజు, డీఆర్డీఏ పీడీ మురళి, డీఈవో బ్రహ్మాజీరావు, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డీఎల్‌పీవో కుమార్, డివిజనల్ పీఆర్వో రాములు తదితరులు పాల్గొన్నారు.

జన సురక్ష పోస్టర్ల ఆవిష్కరణ

పీఎం సురక్ష బీమా యోజన పథకాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమం పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకాలపై ప్రచారం చేసేందుకు ఈనెల 15 నుంచి జనవరి 15 వరకు మూడు నెలల పాటు పత్యేక కార్యాచరణ రూపొందించామని ఆయన పేర్కొన్నారు. బ్యాంకు లేదా పోస్టాఫీసుల్లో ఖాతా కలిగిన ప్రతి ఒక్కరు ఈ పథకంలో చేరేందుకు అర్హులన్నారు. బీమా పథకాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ మధు నాయుడు, డీఆర్డీఏ పీడీ మురళి, నాబార్డ్ డీడీఎం చక్రధర్‌రావు తదితర వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వానల కోసం కప్పలకు పెళ్లి

లక్కవరప్పాడులో గంగాలమ్మకు పూజలు



కప్పలకు పెళ్లి అనంతరం ఊరేగింపు



గంగాలమ్మ గుడి వద్ద మహిళల పూజలు

రాజవొమ్మంగి: వరుణుడు కరుణించాలని కోరుతూ మండలంలో లక్కవరప్పాడులో గిరిజనులు మంగళవారం కప్పలకు పెళ్లి చేశారు. గంగాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ దాదాపు 15 రోజులుగా వర్షాలు లేక వరి పంట ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. తొలకరిలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో వర్షాధారంగా పంటలు వేశామన్నారు. ఇప్పుడు వర్షాలు పడకపోవడంతో దిక్కుతోచని పరిస్థితి ఎదురైందన్నారు. దీంతో కప్పలకు పెళ్లి చేసి, వరుణుడు కరుణించాలని గంగాలమ్మను వేడుకున్నామన్నారు. వాగు నుంచి తీసుకువచ్చిన కప్పలకు గిరిజన సంప్రదాయ ప్రకారం డప్పు వాయిద్యాలతో పెళ్లి జరిపించారు. పాటలు పాడుతూ సందడి చేశారు. రోజంతా ఉపవాసం ఉన్న చిన్నారుల చేత కప్పలను గ్రామంలో ఊరేగించారు. అనంతరం గంగాలమ్మ తల్లి గుడి వద్ద పూజలు జరిపించారు. పసుపు కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పాయసం వండి అమ్మవారికి సమర్పించారు. వర్షాలు కురవాలంటూ గత మూడు వారాలుగా అందరం కలసి ఈ విధంగా గ్రామంలో పూజలు చేస్తున్నామని గిరిజన మహిళలు తెలిపారు. వరి పొలాలు ప్రస్తుతం చిరుపొట్ట దశలో ఉన్నాయని, ఈ దశలో వర్షాలు కురవకుంటే పంటపై ఆశలు వదులుకోవాల్సిందేనని వారు వాపోయారు. ఇప్పటికైనా వరుణుడు కరుణిస్తాడన్న ఆశతో ఉన్నామన్నారు.

డిసెంబర్ 14న జాతీయ లోక్‌అదాలత్

మహారాణిపేట (విశాఖ): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో నిర్వహిస్తున్నారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్టపరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్, బ్యాంక్, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగదాలు(విడాకులు కేసులు కాకుండా) పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చు.

ఉచిత శిక్షణ, ఉపాధి

నిర్మాణ్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ మయూర్

విశాఖ సిటీ: టెక్ మహీంద్రా ఫౌండేషన్ సహకారంతో నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థ డైరెక్టర్ మయూర్ పట్నాల ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై 18 నుంచి 28 ఏళ్లలోపు గల వారు అర్హులని పేర్కొన్నారు. టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్‌నెట్ కాన్సెప్ట్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ స్కిల్స్, బేసిక్ అకౌంటింగ్ స్కిల్స్ కోర్సుల్లో 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని వివరించారు. శిక్షణ అనంతరం ఉపాధి కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు బాజీ జంక్షన్‌లో గల నిర్మాణ్ ఆర్గనైజేషన్ కేంద్రంలో గాని, 9908104113, 6304159549 నెంబర్లలో గాని ఈ నెల 26లోగా సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

28 నుంచి ఐటీఐ ఐదో విడత కౌన్సెలింగ్

కంచరపాలెం: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో వివిధ ట్రేడ్‌ల్లో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 28 నుంచి 5వ విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. 26లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు, 27న సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవాలని కోరారు. కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో ఈ నెల 28 నుంచి 30 వరకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

కొత్తపల్లిలో ఐటీడీఏ పీవో కుటుంబ సభ్యుల సందడి



కొత్తపల్లి జలపాతాన్ని సందర్శిస్తున్న పీవో అభిషేక్ కుటుంబ సభ్యులు

జి.మాడుగుల: మండలంలో కొత్తపల్లి జలపాతాన్ని మంగళవారం పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ కుటుంబ సభ్యులు సందర్శించారు. పీవో అభిషేక్ తండ్రి, తమ్ముడు, కుటుంబ సభ్యులు కలసి ఇక్కడకు వచ్చి ఈ ప్రాంతాల అందాలను వీక్షించారు. పెద్ద పెద్ద బండరాళ్లపై నుంచి పడుతున్న నీటి ప్రవాహం వద్ద సెల్ఫీలు దిగారు. జలపాత ప్రాంత పరిసరాల్లో ఐటీడీఏ ఆధ్వర్యంలో చేపట్టిన సుందరీకరణను వారు వీక్షించారు. ఈ ప్రాంతంలో చల్లటి, చక్కటి వాతావరణంతో పాటు ప్రకృతి అందాలను కొద్దిసేపు వీక్షించి ఆనందంగా గడిపారు.

స్టీల్‌ప్లాంట్‌లో కార్మిక సమ్మె రద్దు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాలు ఈనెల 28న తలపెట్టిన కార్మిక సమ్మె రద్దయింది. మంగళవారం జరిగిన అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ప్రస్తుతం ప్లాంట్ పరిస్థితి దృష్ట్యా యాజమాన్యం అభ్యర్థన మేరకు సమ్మె చేయకూడదని కార్మిక నాయకులు అభిప్రాయపడ్డారు. 28న సమ్మె బదులుగా ఆ రోజు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా 24న గోడ పత్రిక విడుదల చేయాలని, 26న కరపత్రాలు పంపిణీ చేయాలని తీర్మానించారు. సమావేశంలో యాజమాన్యం ప్రతిపాదిస్తున్న వాలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ (వీఆర్‌ఎస్)ను రద్దు చేయాలని, కొత్త నియామకాలు చేపట్టాలని తీర్మానించారు. సమావేశంలో డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, జె.రామకృష్ణ, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, వై.టి.దాస్, డి.అప్పారావు, రామ్మోహన్‌కుమార్, వరసాల శ్రీనివాసరావు, ఎల్.వి. రమణారావు, ఎం.మహాలక్ష్మి నాయుడు, కారు రమణ, కొవిరి అవతారం పాల్గొన్నారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు

- పలువురికి కాళ్లవాపులు, నొప్పులు
- రోగులతో నిండిన వై.రామవరం ఆస్పత్రి



వై.రామవరం సామాజిక ఆరోగ్య కేంద్రం



రోగులతో కిటకిటలాడుతున్న వై.రామవరం సీహెచ్‌సీలో ఇన్‌పేషెంటు వార్డు

వై.రామవరం: మండలంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. రోగుల సంఖ్య తారాస్థాయికి చేరుకుంది. రోజుకు రెండొందల వరకు ఓపీ నమోదవుతోంది. స్థానిక సీహెచ్‌సీలో పరిమితికి మించి రోగులు ఇన్‌పేషెంటు వార్డులో చేరుతున్నారు. ఒక్కొక్క బెడ్‌పైన ముగ్గురేసి రోగులకు సేవలందిస్తున్నారు. ఆస్పత్రి నిండిపోవడంతో మరికొంతమంది గ్రామంలోని బంధువుల ఇంటి వద్ద ఉంటూ వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు. విషజ్వరాలతోపాటు ప్రతీ రోగికి కాళ్ల వాపులు, నొప్పులతో కనీసం నడవలేకపోతున్నారు. వైద్యాధికారులు నిర్విరామంగా పనిచేస్తూ వైద్య సేవలందిస్తున్నా ప్రయోజనం లేకపోతోంది. కాళ్లవాపుల వ్యాధి నిర్ధారణకు ప్రత్యేక పరీక్షలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు రోగులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యతో ఇప్పుడు వ్యవసాయ పనులు చేసుకోలేక పోతున్నామని విచారం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకలుగా మార్చాలని, అన్ని రకాల పరీక్షలు ఏర్పాటు చేసి, ల్యాబ్‌ను ఆధునీకరించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



రోగులందరికీ తాము 24 గంటలు సేవలు అందిస్తున్నాం. ఇన్‌పేషెంట్ వార్డులో 30 బెడ్‌లు ఉండగా, పరిమితిని మించి రోగులు చేరుతున్నారు. జ్వరం వచ్చిన వారికి కాళ్ల వాపులు, నొప్పులు రావడం ఇదే మొదటిసారి. అధిక వర్షాలకు నీరు కలుషితం అవ్వడం వల్ల ఈ సమస్య వస్తుందని అనుమానం ఉంది. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అందరినీ నీరు కాచుకు తాగాలని సూచిస్తున్నాం. మందులు వాడిస్తున్నాం, మెల్ల మెల్లగా తగ్గుతున్నాయి. ఇతర మండలాల నుంచి కూడా రోగులు వచ్చి చేరడంతో ఓపీ ఎక్కువ నమోదవుతోంది.

– డాక్టర్ రాహుల్, సూపరింటెండెంటు, సీహెచ్‌సీ, వై.రామవరం

కాళ్లవాపులు, నొప్పులతో బాధపడుతున్నా



నాకు నెలరోజుల క్రితం జ్వరం వచ్చి తగ్గింది. కాళ్లవాపులు, నొప్పులు ఎక్కువై 20 రోజులుగా నరకయాతన పడుతున్నాను. కనీసం బాత్‌రూమ్‌కు వెళ్లడానికి నడవ లేకపోతే ఇద్దరు పట్టుకుని తీసుకెళ్లేవారు. ఇదేమి వింత వ్యాధో తెలియడం లేదు. ఆస్పత్రిలో బెడ్‌లు ఖాళీ లేక ఇంటివద్దనే ఉంటూ వైద్యం చేయించుకున్నాను. ఇప్పుడిప్పుడే కొంచెం నడవగలుగుతున్నాను. నాతోపాటు ఇలా జ్వరాలు వచ్చిన చాలామంది రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిని 50 పడకల స్థాయికి పెంచి, మరిన్ని పరికరాలు, సౌకర్యాలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– ముర్ల వెంకటరత్నం, వై.రామవరం

వ్యాధి నిర్ధారణ చేయాలి



నాకు జ్వరం వచ్చింది. కీళ్ల నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో వ్యవసాయం, ఇంట్లో పనులు చేసుకోలేకపోతున్నాం. వైద్యాధికారులు మంచిగానే సేవలు అందిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ సర్వే నిర్వహించి ఆస్పత్రిలో ప్రత్యేక పరీక్షలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– మడకం వరాలమ్మ, వై.రామవరం

కర్ర ఊత ఉంటేగాని నడవలేకపోతున్నాను..



నాలుగు రోజుల క్రితం వై.రామవరం సీహెచ్‌సీలో జాయిన్ అయ్యాను. వైద్య సేవలందించగా ప్రస్తుతం జ్వరం తగ్గింది. కాళ్లనొప్పులు, వాపులు ఎక్కువయ్యాయి. కర్ర ఊత ఉంటేగాని నడవలేకపోతున్నాను. పొలం పనులు నిలిచిపోయాయి. ఆస్పత్రిలో 30 పడకలు చాలక ఇబ్బందుల పడుతున్నాం. అదనపు భవనాలు నిర్మించాలి.

– కయ్యం చినబ్బాయి, దబ్బమామిడి గ్రామం, వై.రామవరం మండలం

జాతీయ అథ్లెట్‌కు ఘన సన్మానం



లోహిత్‌బాబుకు సన్మానిస్తున్న సురేష్‌కుమార్

డుంబ్రిగుడ: ఈ నెల 4, 5, 6 తేదీల్లో రాజమహేంద్రవరం, గుంటూరులో జరిగిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన శెట్టి లోహిత్‌ని వైఎస్సార్ టీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తెడబారికి సురేష్‌కుమార్ శాలువతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన యువకులు విద్యతోపాటు క్రీడారంగంలో రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో గెలుపొంది మన్యానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

నేడు నర్సుల అసోసియేషన్ ఎన్నికలు

మహారాణిపేట: ఏపీ ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ జిల్లా యూనిట్‌కు బుధవారం ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేజీహెచ్ యూనియన్ బ్యాంకు శాఖ పక్కనున్న భవనంలోని నర్సస్ క్లాక్ రూమ్‌లో సీక్రెట్ బ్యాలెట్ విధానంలో ఎన్నికలు జరుగుతాయి. మొత్తం 555 మంది నర్సులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. భవాని, ఉషారాణి ప్యానళ్లు పోటీ పడుతున్నాయి. ఎన్నికల నిర్వహణకు రెండు పోలింగ్ స్టేషన్లు, 12 మంది సిబ్బందిని నియమించారు.

ధ్రువపత్రాల జారీకి ఇబ్బందులు పెడితే చర్యలు

కలెక్టర్ దినేష్ కుమార్ హెచ్చరిక



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి నోటరీ చేయించాలని గిరిజనులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, మండల సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ పరంగా జారీ చేసే ధ్రువపత్రాలకు అఫిడవిట్లతో పని లేదన్నారు. అయినప్పటికీ అఫిడవిట్లు అడిగితే తీవ్రంగా పరిగణిస్తామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. జిల్లాలో 4110 గ్రామాల్లో 2.71 లక్షల కుటుంబాలకు సర్వే చేయగా 16వేల మందికి ఆధార్ కార్డులు లేనట్టుగా గుర్తించామన్నారు. వీరికి తక్షణ జారీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూములను రీసర్వే చేసి సర్వే నంబర్లకు కచ్చితమైన భూ విస్తీర్ణాన్ని గుర్తించి నమోదు చేయాలని సూచించారు. సర్వే చేపట్టేటప్పుడు ముందుగా గ్రామాలకు సమాచారం ఇవ్వాలన్నారు. భూముల సర్వే సక్రమంగా లేకపోతే సర్వేయర్లపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో 86 నీటి సంఘాలు ఉన్నాయన్నారు. వీటికి నవంబర్ 21న పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ఈ బాధ్యతను తహసీల్దార్లు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డీఆర్వో పద్మావతి, పీఎంయూ ప్రోగ్రాం అధికారి రాంగోపాల్ పాల్గొన్నారు.

స్కూళ్ల నిర్వహణకు సగం నిధులే!

- ఎట్టకేలకు విడుదల చేసిన ప్రభుత్వం

విశాఖ విద్య: ఎట్టకేలకు పాఠశాల నిర్వహణ నిధులను కూటమి ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు సమగ్ర శిక్ష రాష్ట్ర డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయాలకు చేరాయి. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా స్కూళ్ల నిర్వహణకు నిధులు విడుదలయ్యాయి. 2024–25 విద్యా సంవత్సరానికి లెక్కగట్టిన నిధుల్లో ప్రస్తుతం 50 శాతం విడుదల చేశారు. మిగతా 50 శాతం ఎప్పట్లోగా మంజూరు చేస్తారనేది స్పష్టం చేయలేదు. విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు దాటినా పాఠశాలల నిర్వహణ నిధులు మంజూరు చేయకపోవడంపై ఉపాధ్యాయుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో పాఠశాలల నిర్వహణ భారమంతా హెచ్‌ఎంలపైనే పడింది. కొన్ని చోట్ల పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులంతా తమ వేతనాల్లోంచి కొంత మొత్తం పోగు చేసి.. ప్రాధాన్యత మేర కు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్కూల్ గ్రాంట్, ఎమ్మార్సీ గ్రాంట్ల మంజూరు కోసమని ఉపాధ్యాయ సంఘాలన్నీ రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులకు పలుమార్లు వినతిపత్రాలను అందజేశాయి. స్పందించిన కూటమి ప్రభుత్వం వార్షిక నిర్వహణ నిధుల మొత్తంలో 50 శాతం మంజూరు చేసింది. విశాఖ జిల్లాలో 559 పాఠశాలలకు రూ.91.95 లక్ష లు, అనకాపల్లి జిల్లాలో 1,392 పాఠశాలలకు రూ.172.075 లక్షలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,662 స్కూళ్లకు 152.05 లక్షలను విడుదల చేసింది.

ఒక్కో ఎమ్మార్సీకి రూ.1.30 లక్షలు

ఉమ్మడి జిల్లాలోని మండల వనరుల కేంద్రాలకు కూడా నిధులు మంజూరయ్యాయి. మండల కేంద్రాల్లో ఎంఈవోలు వీటిలోనే కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. వీటి నిర్వహణకు ఒక్కో దానికి రూ.1.30 లక్షలు చొప్పున మంజూరయ్యాయి. వీటిలో ఎమ్మార్సీ నిర్వహణకు రూ.30 వేలు, టీఎల్‌ఎం కోసం రూ.30 వేలు, సమావేశాల రవాణా భత్యం కింద రూ.30 వేలు, కాంటిజెంట్ గ్రాంట్‌గా రూ.40 వేలు ఖర్చు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విశాఖ జిల్లాలో 11 ఎమ్మార్సీలకు రూ.14.30 లక్షలు, అనకాపల్లి జిల్లాలో 24 ఎమ్మార్సీలకు రూ.31.20 లక్షలు, అల్లూరి జిల్లాలో 22 ఎమ్మార్సీలకు రూ.28.6 లక్షలు విడుదలయ్యాయి.



ఉమ్మడి జిల్లాలో అత్యధిక సంఖ్యలో విద్యార్థులున్న చంద్రంపాలెం హైస్కూల్

భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు

- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం హెచ్చరిక
- కిల్లోగుడ ప్రభుత్వ బాలికల ఇంగ్లీష్ మీడియం ఆశ్రమ పాఠశాల సందర్శన
- డిజిటల్ తరగతుల పరిశీలన
- బోధనలో ప్రమాణాలు పాటించాలని ఆదేశం



వంటగదిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు

డుంబ్రిగుడ: విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం హెచ్చరించారు. అరకు–జైపూర్ జంక్షన్ సమీపంలోని కిల్లోగుడ ప్రభుత్వ బాలికల ఇంగ్లీష్ మీడియం ఆశ్రమ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. వంటగదిని పరిశీలించారు. విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యత ఉండాలని, మెనూ ప్రకారం ఆహారం అందించాలని నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిజిటల్ తరగతులను పరిశీలించారు. విద్యార్థులు ఇంగ్లీష్ సబ్జెక్ట్‌లో పట్టు సంపాదించలని విద్యార్థులకు సూచించారు. హోం వర్క్‌ను బాధ్యతగా పరిశీలించాలని ఉపాధ్యాయులకు సూచించారు. బోధన విషయంలో ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. కొంతమంది విద్యార్థులు నేలపై కూర్చొని ఉండటాన్ని ఆయన గమనించారు. పాఠశాల సామర్థ్యం 350 విద్యార్థులు కాగా అంతకుమించి 540 మందిని చేర్పించుకోవడం వల్ల విద్యార్థులు చాలీచాలని వసతుల మధ్య వరండాల్లో పడుకోవాల్సి వస్తోందని హెచ్‌ఎంపై మండిపడ్డారు. హాజరు పట్టీని పరిశీలించారు. దసరా సెలవుల అనంతరం ఈనెల 14న పాఠశాల ప్రారంభమైతే నేటి వరకు రిజిస్టర్‌లో హాజరు వేయకపోవడంపై ఆమెను ప్రశ్నించారు. ఈ విషయాలన్నింటినీ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో అరకు సర్పంచ్ గుగ్గుడు శారద, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు బాకా సింహాచలం, చట్టరి కృష్ణారావు, లోతుగెడ్డ నాగేశ్వరావు, మాజీ మండల అధ్యక్షుడు గోపాల్, కిల్లో జగన్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో తెగిన విద్యుత్ వైర్లను తాకరాదు

అనకాపల్లి: దానా తుపాను హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్‌శాఖ ఉద్యోగులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ జిల్లా పర్యవేక్షక ఇంజినీర్ జి.ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాల కారణంగా తెగి పడిన విద్యుత్ వైర్లను గాని తడిసిన విద్యుత్ స్తంభాలను గాని, ప్రజలు నేరుగా తాకవద్దని ఆయన కోరారు. ఎక్కడైనా విద్యుత్ సమస్య ఉన్నట్లయితే 9490610022ను సంప్రదించాలని కోరారు.

రోడ్డు బాగు చేయకపోతే గోడ కట్టేస్తాం

జనవాణిలో సీపీఐ ఎంఎల్ వినోద్‌మిశ్రా బృందం వినతి

అడ్డతీగల: అడ్డతీగల–ఏలేశ్వరం రోడ్డు యుద్ధప్రాతిపదికన బాగు చేయకపోతే, వచ్చే నెల 4న అడ్డంగా గోడ కట్టేస్తామని కూటమి ప్రభుత్వాన్ని సీపీఐ ఎంఎల్ వినోద్‌మిశ్రా బృందం సభ్యులు హెచ్చరించారు. ఈ విషయమై మంగళవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో జనవాణి ఇన్‌చార్జి పంతం నానాజీకి వినతిపత్రం అందజేశామన్నారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం రమణయ్యపేట నుంచి జె.అన్నవరం వరకూ అల్లూరి జిల్లా అడ్డతీగల మండలంలో పలు గ్రామాలు మీదుగా 13 కిలోమీటర్ల మేర రోడ్డు పదేళ్లుగా గోతులమయంగా మారి అధ్వానంగా ఉందన్నారు. అనేక ప్రమాదాల్లో ప్రజలు ప్రాణాలు పోవడంతో పాటు తీవ్ర గాయాల పాలవుతున్నారని వాపోయారు. ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించకుంటే ప్రత్యక్ష కార్యాచరణకు వెనకాడబోమన్నారు. పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొసిరెడ్డి గణేశ్వరావు, జై భీమ్ భారత్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడిశెట్టి వీరబాబు, గిరిజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌పాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అతివేగంతో చెట్టును ఢీకొట్టిన కారు



సీలేరు సమీప మర్రిగూడెం వద్ద బోల్తా పడిన లారీ



సీలేరు సరిహద్దులో చెట్టును ఢీకొన్న కారు

- మహిళ మృతి..
- నలుగురికి గాయాలు

సీలేరు: ఆంధ్ర –ఒడిశా సరిహద్దు సీలేరు సమీపంలో అతివేగంతో వచ్చిన కారు చెట్టును ఢీకొని బోల్తా పడ్డ ఘటనలో మహిళ మృతి చెందగా, నలుగురికి గాయాలయ్యాయి. గూడెంకొత్తవీధి మండలం ముర్లగెడ్డ గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు కారు(ఏపీ31టీవీ2001 నంబరు)లో మంగళవారం ఒడిశా – చిత్రకొండ ప్రాంతానికి వెళ్లి పనులు ముగించుకుని సీలేరు మీదుగా వెళ్తున్నారు. ఈ క్రమంలో సరిహద్దు రాజులకొండ వద్ద అతివేగంతో చెట్టును కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సప్పర్ల ప్రాంతానికి చెందిన కిల్లో జానకమ్మ(35) సంఘటన స్థలంలో మృతి చెందగా, ఒక పాపకు వెన్నుముఖ విరగగా, మరో పాప తలకు తీవ్ర గాయమైంది. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవరు పరారీలో ఉన్నాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి చిత్రకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. మరో ఘటనలో గాజువాక నుంచి సీలేరు మీదుగా మోతుగూడెం వెళ్తున్న ఓ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ప్రాణపాయం లేనప్పటికి లారీలో సామగ్రి చెల్లాచెదురయ్యాయి.

ఘనంగా కొమరం భీమ్ జయంతి



నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ విజయభారతి, అధ్యాపక సిబ్బంది



కొమరం భీమ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొమరం భీమ్ సొసైటీ సభ్యులు, విద్యార్థులు

చింతపల్లి: స్థానిక డిగ్రీ కళాశాలలో కొమరం భీమ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ విజయభారతి మాట్లాడుతూ హైదరాబాద్ నిజాం పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన గొప్పయోధుడు కొమరం భీమ్ అని అన్నారు. ఆయన చేసిన పోరాటాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసపాత్రుడు, అధ్యాపకులు వి.రమణ, కె.లీలాపావని, కె.సంతోషి, లైబ్రేరియన్ జగత్‌రాయ్ పాల్గొన్నారు.

సీలేరు: జి.కె.వీధి మండలం సీలేరులో కొమరం భీమ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరం భీమ్ సొసైటీ చీఫ్ ప్రమోటర్ మనోజ్ మాట్లాడుతూ జల్, జంగిల్ జమీన్ ఆదివాసీల సొంతమని, స్వయంపాలన వారి జన్మహక్కు అని, నాటి నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసి జోడెన్ ఘాటీలో కొమరం భీమ్ అమరుడయ్యాడని తెలిపారు. కార్యక్రమంలో కొమరం భీమ్ సొసైటీ అధ్యక్షుడు కోడా ఆనంద్, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుపాను ఎఫెక్ట్.. పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం : దానా తుఫాను కారణంగా వాల్తేర్ డివిజన్ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

23న రద్దయిన రైళ్లు

కన్యాకుమారి–డిబ్రూగఢ్(22503) ఎక్స్‌ప్రెస్, సిల్చార్–సికింద్రాబాద్(12514) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–భువనేశ్వర్(17016) విశాఖ ఎక్స్‌ప్రెస్, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–హౌరా(12840) మెయిల్ ఎక్స్‌ప్రెస్, పుదుచ్చేరి–హౌరా(12868) ఎక్స్‌ప్రెస్, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్– షాలిమర్(22826) షాలిమర్ ఎక్స్‌ప్రెస్, పుదుచ్చేరి–భువనేశ్వర్(12897)ఎక్స్‌ప్రెస్, కేఎస్‌ఆర్ బెంగళూరు–భువనేశ్వర్ (18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, ఛత్రపతి శివాజి టెర్మినస్ ముంబయి–భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీ బెంగళూరు– గౌహతి (12509) ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–హౌరా(18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–హౌరా(12704)ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీటీ బెంగళూరు–హౌరా (22888)హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీటీ బెంగళూరు–హౌరా (12864) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, సూరత్–బ్రహ్మపూర్(09059) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, కామాఖ్య– ఎస్ఎంవీ బెంగళూరు(12552) ఏసీ ఎక్స్‌ప్రెస్, డిబ్రూగఢ్–కన్యాకుమారి(22504) వివేక్ ఎక్స్‌ప్రెస్, గాంధీదాం–పూరీ(22973) ఎక్స్‌ప్రెస్

24న రద్దయిన రైళ్లు

సికింద్రాబాద్–మాల్దా టౌన్ (03429) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, తిరునల్వేలి–షాలిమర్(06087) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, హౌరా–సికింద్రాబాద్(12703)ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, ఖరగ్‌పూర్–విల్లుపురం (22603) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, షాలిమర్–హైదరాబాద్(18045)ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి–మంగుళూరు(22851) వివేక్ ఎక్స్‌ప్రెస్, షాలిమర్–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12841) కోరమండల్ ఎక్స్‌ప్రెస్, హౌరా–తిరుచ్చిరాపల్లి(12663) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, హౌరా–ఎస్ఎంవీటి బెంగళూరు (12863) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, షాలిమర్–వాస్కోడగామా (18047) అమరావతి ఎక్స్‌ప్రెస్, హౌరా – ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12839) మెయిల్ ఎక్స్‌ప్రెస్, పాట్నా–ఎర్నాకుళం (22644) ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి–ఎంజీఆర్‌చెన్నై సెంట్రల్ (06090) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, రూర్కెలా– గుణుపూర్(18117) రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్, కటక్–గుణుపూర్(08421) మెము ఎక్స్‌ప్రెస్, గుణుపూర్–విశాఖపట్నం(08521) పాసింజర్ స్పెషల్, పలాస–విశాఖపట్నం(07471) మెము స్పెషల్, భువనేశ్వర్–జునాగఢ్(20837) ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–జగదల్‌పూర్(18447) హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్, పూరీ–గుణుపూర్(18417) ఎక్స్‌ప్రెస్, విశాఖ–భువనేశ్వర్(20842) వందేభారత్ ఎక్స్‌ప్రెస్, విశాఖ–డిఘా(22874) ఎక్స్‌ప్రెస్, గుణుపూర్–రూర్కెలా (18118) రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్, విశాఖ–భువనేశ్వర్(22820) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, విశాఖ–బ్రహ్మపూర్ (08532) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, ఎంజీర్ చెన్నై సెంట్రల్–షాలిమర్ (12842) కోరమండల్ ఎక్స్‌ప్రెస్, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–సాంత్రగచ్చి (22808) ఏసీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీటి బెంగళూరు–ముజఫర్‌పూర్(15227) ఎక్స్‌ప్రెస్, జునాగఢ్‌రోడ్–భువనేశ్వర్ (20838) ఎక్స్‌ప్రెస్, జగదల్‌పూర్–భువనేశ్వర్ (18448) హిరాకండ్ ఎక్స్‌ప్రెస్, తంబరం–సంత్రగచ్చి(06095) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీ బెంగళూరు–హౌరా(12246) దురంతో ఎక్స్‌ప్రెస్, గుణుపూర్–పూరీ(18418) ఎక్స్‌ప్రెస్, పూరీ–తిరుపతి(17479) ఎక్స్‌ప్రెస్, విశాఖ–గుణుపూర్(08522) పాసింజర్ స్పెషల్, విశాఖ–పలాస(07470) మెము, విశాఖ–బ్రహ్మపూర్(18526) ఎక్స్‌ప్రెస్.

25న రద్దయిన రైళ్లు

బ్రహ్మపూర్–సూరత్(09060) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, డిఘా–విశాఖపట్నం(22873) ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–విశాఖపట్నం(22819) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, బ్రహ్మపూర్–విశాఖపట్నం (08531) పాసింజర్ స్పెషల్, గుణుపూర్–విశాఖపట్నం(08521) పాసింజర్ స్పెషల్, బ్రహ్మపూర్–విశాఖపట్నం(18525) ఎక్స్‌ప్రెస్, గుణుపూర్–కటక్(08422) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–అమృత్‌సర్(20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్, గుణుపూర్–పూరీ(18418) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–గుణుపూర్(08522) పాసింజర్ స్పెషల్, పూరీ–గుణుపూర్(18417) ఎక్స్‌ప్రెస్.